వాళ్లు దర్జాగా తిరుగుతుంటే..

మేం పనిచేయాలా?

కలెక్టర్ ఎదుట పారిశుధ్య కార్మికుడి ఆవేదన


కలెక్టర్ ఎదుట ఆవేదన వ్యక్తం చేస్తున్న పారిశుధ్య కార్మికుడు

పుట్టపర్తి, సెప్టెంబరు 21: 'మేం రాత్రనక.. పగలనక.. చెత్త తీస్తుంటే.. కొందరు మాత్రం ఖాళీగా తిరుగుతూ జీతాలు తీసుకుంటున్నారు. వాళ్లు దర్జాగా తిరుగుతుంటే.. మేం మాత్రం చెత్తతీయాలా' అంటూ ఓ పారిశుధ్య కార్మికుడు.. జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశాడు. స్థానిక కలెక్టరేట్‌లో శనివారం స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం నిర్వహించారు. కొంత మంది మున్సిపల్ కార్మికులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఓ కార్మికుడు మాట్లాడుతూ.. అధికారులకు డ్రైవర్లు, పీఏలుగా కొంతమంది పారిశుధ్య కార్మికులు పనిచేస్తుండటంతో తమపై పనిభారం పెరిగిందని వాపోయాడు. దీనిపై ఎవరూ జోక్యం చేసుకోలేదంటూ కలెక్టర్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశాడు. దీంతో కలెక్టర్ అవాక్కయ్యారు. మౌనంగా ఉండిపోయారు. వారు పనికి రాకపోతే తాము సమ్మెకు దిగుతామని ఆ కార్మికుడు తెలిపాడు. పుట్టపర్తి మున్సిపాలిటీలో పాలన గాడితప్పిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. కార్మికులు, సిబ్బంది ఎవరికివారే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఇటీవల బదిలీపై వెళ్లిన కమిషనర్‌పై అప్పట్లో సిబ్బంది తిరుగుబాటు చేశారు. నూతనంగా వచ్చిన కమిషనర్ ప్రహ్లాదకు సైతం సిబ్బంది సహకరించడం లేదని తెలుస్తోంది. దీనిపై జిల్లా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు మూటగట్టుకుంటున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్‌ను కార్మికుడు నిలదీయడం చర్చనీయాంశమైంది.

స్త్రీచైతన్యం కోసం న్యాయ సదస్సులు

అక్టోబరు 5న నల్లమాడ నుంచి ప్రారంభం

న్యాయాధికారి జయలక్ష్మి


మాట్లాడుతున్న న్యాయాధికారి

కదిరి లీగల్, సెప్టెంబరు 21: సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల చైతన్యం కలిగించేందుకు న్యాయసదస్సులు నిర్వహించదలచినట్లు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, న్యాయాధికారి ఎస్.జయలక్ష్మి పేర్కొన్నారు. అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో శనివారం న్యాయాధికారి స్థానిక కోర్టు ఆవరణలో సమావేశం నిర్వహించారు. కోర్టు పరిధిలోని పది మండలాల్లో నిర్వహించనున్న న్యాయసదస్సుల వివరాలను న్యాయాధికారి వెల్లడించారు. అక్టోబరు 5న నల్లమాడ ఎంపీడీఓ కార్యాలయం నుంచి సదస్సులు ప్రారంభిస్తామన్నారు. ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు స్త్రీచైతన్యం కోసం ప్రత్యేకంగా వీటిని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సులను వచ్చే ఏడాది మార్చి వరకు 10 మండలాల్లో ఏర్పాటు చేస్తామన్నారు. ఇద్దరు న్యాయవాదులు అనుసంధానకర్తలుగా వ్యవహరించే సదస్సుల్లో అన్నిశాఖల అధికారులు, స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. గృహహింస, వరకట్నం, లైంగిక వేధింపులు, సమాన పనికి సమాన వేతనం, మహిళల అక్రమ రవాణా, యాసిడ్ దాడులు, హత్యలు, అత్యాచారాలు, మహిళలకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి సదస్సులో చర్చిస్తారని వివరించారు. సదస్సులను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నల్లమాడ ఎంపీడీఓ కొండన్న, రెడ్స్ సంస్థ ప్రతినిధి కత్తి ఎల్లప్ప పాల్గొన్నారు.

శ్రీవారి లడ్డూ కల్తీపై విచారణ చేయాలి

ఎంపీ బీకే డిమాండ్


మాట్లాడుతున్న ఎంపీ బీకే పార్థసారథి

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 21: తిరుమల ప్రతిష్ఠకు భంగం కలిగించేలా శ్రీవారి లడ్డూను కల్తీ చేయడంపై సమగ్ర విచారణ చేయించాలని ఎంపీ బీకే పార్థసారథి డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో విలేకరుల సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ.. భక్తులు పవిత్రంగా భావించే తిరుమల ప్రసాదం లడ్డూలో కొవ్వు కలపడం సిగ్గుచేటన్నారు. గత వైసీపీ పాలనలో జగన్‌రెడ్డి.. తిరుమల ప్రతిష్ఠను అపహాస్యం చేయడమే విధిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. ఇలా దేవుడితో ఆటలాడినందుకు జగన్‌రెడ్డికి తగిన గుణపాఠం జరిగిందన్నారు.

మహిళ ప్రాణాలు కాపాడిన పోలీసులు

హిందూపురం, సెప్టెంబరు 21: కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకునేందుకు రైల్వే ట్రాక్‌పై కూర్చున్న మహిళను శనివారం పోలీసులు కాపాడారు. అనంతపురం నగరంలోని పాతూరుకు చెందిన వీరాచారి భార్య శాంత కుటుంబ కలహాలతో నాలుగు రోజుల క్రితం హిందూపురంలోని బంధువుల ఇంటికొచ్చింది. కలహాలతో విసిగిపోయిన ఆమె ఆత్మహత్య చేసుకోవాలనుకుంది. హిందూపురం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రైల్వేస్టేషన్ పక్కగల రైల్వేట్రాక్‌పైకి వెళ్లింది. ఈమెను చూసిన స్థానికులు డయల్ 100కు సమాచారం ఇచ్చారు. సీఐ కరీం వెంటనే స్పందించి పోలీసు సిబ్బందిని ఆ ప్రాంతానికి పంపారు. అక్కడికెళ్లిన పోలీసులు రైల్వేట్రాక్‌పై ఉన్న శాంతను పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు.


మహిళను రైల్వేట్రాక్‌పై నుంచి తీసుకొస్తున్న పోలీసులు

జేబ్రాండ్లకు బై.. బై..



జగన్ మద్యానికి చెల్లుచీటీ..

గత ఐదేళ్లూ మందుబాబులకు అవస్థలు

పెంచిన ధరలతో జేబులకు చిల్లు

యథేచ్ఛగా కర్ణాటక మద్యం రవాణా

కూటమి పాలనలో బ్రాండెడ్ మద్యం సరఫరాకు నిర్ణయం

ధర కూడా అందుబాటులోనే.. కొత్త పాలసీకి ఓకే

జిల్లాలో 72 దుకాణాలకు సన్నాహాలు

పుట్టపర్తి సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మద్యంప్రియులకు కూటమి ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. ప్రజల ప్రాణాలు తోడేస్తున్న జే బ్రాండ్లను పక్కనపెట్టి, పాపులర్ బ్రాండ్ల మద్యాన్ని అందుబాటులోకి తేవాలని నిర్ణయించింది. అది కూడా అందుబాటు ధరలోనే. దీంతో మద్యం ప్రియులకు కిక్కే.. కిక్కు. గత వైసీపీ ఐదేళ్ల పాలన ఆద్యంతం మద్యంబాబులు తిప్పలు పడ్డారు. ధరలు విపరీతంగా పెంచడంతో కొనలేక ఇబ్బందులకు లోనయ్యారు. అంత రేటు పెట్టి కొనుగోలు చేసినా.. బ్రాండెడ్ మద్యం దొరకదు. లోకల్ మద్యమే దిక్కు. విధిలేక దానినే తాగిన వేలాదిమంది ఆస్పత్రుల పాలయ్యారు. అనేక అనారోగ్య సమస్యలతో నేటికీ సతమతమవుతున్నారు. వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయి. మద్యాన్ని పూర్తిగా నిషేధిస్తామన్న గత వైసీపీ ప్రభుత్వం ఆదాయ వనరుగా మార్చుకుంది. ఇష్టానుసారం ధరల నిర్ణయించి ఆపార్టీ నాయకుల డిస్టిలరీల్లో తయారు చేసిన నాసిరకం రంగు నీళ్ల మద్యాన్ని విక్రయించింది. రూ.వేల కోట్లు కొల్లగొట్టారు. ఆ అడ్డగోలు మద్యం విధానానికి కూటమి ప్రభుత్వం స్వస్తి పలికింది. నూతన విధానాన్ని తెరమీదికి తెచ్చింది. అందుబాటులో ధర, నాణ్యమైన మద్యం సరఫరా చేయాలనీ, ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలని నిర్ణయించింది. నూతన ఎక్సైజ్ పాలసీకి రాష్ట్ర మంత్రి మండలి ఆమోదంతో జిల్లాలో మద్యం షాపుల నిర్వహణదారుల్లో సందడి మొదలైంది. నోటిఫికేషన్ విడుదలే తరువాయి. దుకాణాల కోసం గతంలోలా తీవ్రపోటీ ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. కర్ణాటక మద్యం అక్రమ రవాణాకు చెక్ పడనుంది. సరిహద్దులో రాత్రింబవళ్లు కాపలా కాయాల్సిన తిప్పలుండవని ఎక్సైజ్ శాఖ భావిస్తోంది.

బ్రాండ్ల కిక్

మద్యం ధరలు, రిటైల్ వ్యాపారం, పన్నులపై మంత్రివర్గ ఉపసంఘం చేసిన సిఫార్సులను రాష్ట్ర మంత్రిమండలి ఆమోదించిన సంగతి తెలిసిందే. దుకాణాల్లో నాణ్యమైన మద్యాన్ని అందుబాటులోకి తేవాలనీ, క్వార్టర్ బాటిల్ రూ.99కే అందించాలని నిర్ణయించింది. గత వైసీపీ హయంలో పాపులర్ బ్రాండ్ల బదులుగా ఆపార్టీ నాయకుల డిస్టలరీల్లో తయారు చేసిన నాసిరకం బ్రాండ్ల మద్యంబాబులను బెంబేలెత్తించాయి. ఇక్కడ దొరికే నారిరకం మద్యం తాగలేక జిల్లావాసులు కర్ణాటక మద్యానికి జైకొట్టేవారు. దీంతో సరిహద్దు కర్ణాటక నుంచి జిల్లాలోకి ప్రవేశించిన కర్ణాటక మద్యం ఏరులైపారింది. రాష్ట్ర ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం కర్ణాటక పాలైంది. సరిహద్దులోని హిందూపురం, మడకశిర, పెనుకొండ, పుట్టపర్తి, కదిరి నియోజకవర్గాల్లో కర్ణాటక మద్యం గొలుసు దుకాణాలతో స్థానిక దుకాణాల్లో అమ్మకాలు భారీగా పడిపోయాయి. గత ప్రభుత్వంలో వైసీపీ నేతలు కర్ణాటక మద్యం రవాణాతో రూ.కోట్లు వెనుకేసుకున్నారు. రెండేళ్లలో కేవలం సెబ్ దాడుల్లో రూ.4కోట్ల విలువ చేసే 47,483 లీటర్ల కర్ణాటక మద్యం పట్టుబడిందంటే జిల్లాలోకి ఏస్థాయిలో తరలివచ్చిందో అర్థం చేసుకోవచ్చు. కర్ణాటకలో చీప్ లిక్కర్ క్వార్టర్ సీసా ధర రూ.80కి విక్రయిస్తున్నారు. రాష్ట్రంలో నాణ్యమైన మద్యాన్ని రూ.99కంటే తక్కువ ధరకు ఇచ్చే దిశగా కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఫలితంగా జిల్లాలోకి కర్ణాటక మద్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడనుంది. జిల్లాలో మద్యం అమ్మకాలు పెరగనున్నాయి. ప్రస్తుతం జిల్లాలో సగటున నెలకు రూ.40 కోట్ల మద్యం విక్రయాలు కొనసాగుతున్నాయి. పాపులర్ బ్రాండ్లను అందుబాటులోకి తెచ్చి, దుకాణాలను పెంచి, తక్కువ ధరకే సరఫరా చేస్తే అమ్మకాలు పెరగనున్నాయి.

మొదలైన సందడి

జిల్లాలో 65 ప్రభుత్వ మద్యం దుకాణాలతోపాటు 10 బార్, రెస్టారెంట్లు ఉన్నాయి. ఎనిమిది బార్, రెస్టారెంట్లు నడుస్తున్నాయి. కొత్త పాలసీలో భాగంగా జనాభా ప్రాతిపదికన మద్యం దుకాణాల సంఖ్యను నిర్ణయిస్తారు. ఈలెక్కన జిల్లాలో 72 మద్యం దుకాణాలకు పెరిగే చాన్సు ఉంటుందని ఎక్సైజ్ శాఖ భావిస్తోంది. మద్యం దుకాణాల్లో గీత కార్మికులకు 10 శాతం కేటాయించాలని కమిటీ చేసిన సిఫార్సులకు ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. గీత కార్మికులు అత్యధికంగా హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజక వర్గాల్లో ఉన్న నేపథ్యంలో ఏయే మండలాల్లో కేటాయిస్తారో అన్న చర్చ నడుస్తోంది. కొత్త మద్యం పాలసీకి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలపడంతో గతం తరహాలోనే లాటరీ విధానంలో వీటిని కేటాయిస్తారని తెలుస్తోంది. నోటిఫికేషన్ విడుదలకు ఎక్సైజ్ శాఖ కసరత్తు చేస్తోంది. జిల్లాలో వాక్ ఇన్ స్టోర్ల ఏర్పాటుకు అవకాశం ఉంది. లైసెన్సులు పొందిన వారి దుకాణాల పక్కనే స్టోర్లు అదనంగా ఫీజు చెల్లించి ఏర్పాటు చేసుకోవచ్చు. దీనికి అదనంగా రూ.5 లక్షలు లైసెన్సీదారులు ప్రభుత్వానికి చెల్లించాలి. జిల్లాలో రూ.50 లక్షల నుంచి 80 లక్షలదాకా దుకాణాల లైసెన్సు ఫీజు పెట్టనుంది. దుకాణాల దరఖాస్తు రుసుం రూ.2లక్షలతో ఒక వ్యక్తి ఎన్ని షాపులకైనా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించనుంది. దీంతో దుకాణాల నిర్వాహకుల్లో సందడి మొదలైంది. హిందూపురం, ధర్మవరం, కదిరి, పెనుకొండ, చెన్నేకొత్తపల్లి, కొత్తచెరువు, ముదిగుబ్బ, బత్తలపల్లి, మడకశిర, చిలమత్తూరు, పుట్టపర్తి తదితర ప్రాంతాల్లో దుకాణాలకు పోటీ పడే అవకాశం ఉంది. మండలానికి రెండు దుకాణాలు ఏర్పాటు చేయవచ్చు. దుకాణాల కోసం బృందాలుగా ఏర్పడి, దరఖాస్తుదారులు సిద్ధమవుతున్నారు.

ఆగని కన్నీళ్లు..!

ఈసారైనా.. పండకపోతుందా..
ఇంకోసారైనా పండకపోతుందా.. అని..
ఏటా పంట పెట్టడం.. నష్టపోవడం..
నాలుగేళ్లు నష్టం.. నష్టం..
అయినా.. అన్నదాత వదల్లేదు..
అప్పులు పెరుగుతున్నా మానలేదు..
ఐదోసారీ పంట పెట్టాడు..
ఫలితం మాత్రం మారలేదు..
మళ్లీ.. అదే.. అదే..
అప్పుల పంటే..
ఆశల పంట..
కళ్లెదుటే నిలువునా ఎండిపోయింది..
వాన చుక్క కోసం.. చూచి.. చూచి..
గుండె బరువెక్కింది..
ఇక.. ఆశ చచ్చిపోయింది..
పొంగుకొస్తున్న కన్నీళ్లను
దిగమింగుకుంటూ..
ప్రేమగా పెంచుకున్న పంటను..
తన చేతులతోనే తొలగిస్తున్నాడు..
మాటాడితే..
కన్నీళ్లే సమాధానంగా చెబుతున్నాడు..
ఓ కౌలురైతు...

రైతు ఇంట.. మళ్లీ అప్పుల పంట

ఎండుతున్న వేరుశనగ పైరు

తొలగించేసుకున్న అన్నదాత

ఎకరాకి రూ.20వేలు నష్టం



దిగుబడిలేని వేరుశనగను చూపుతున్న రైతు అస్లాంబాషా



వేరుశనగ పంటను తొలగించుకుంటున్న రైతు దంపతులు

మడకశిర పట్టణానికి చెందిన రైతు అస్లాంబాషాకి సొంత భూమిలేదు. రెండెకరాలు కౌలుకు తీసుకుని, ఐదేళ్లుగా వేరుశనగ పంట సాగుచేస్తున్నాడు. ఏటా అతివృష్టి, అనావృష్టితో పంటను నష్టపోతూనే ఉన్నాడు. మళ్లీ అప్పులు చేసి పంట పెడుతున్నాడు. ఇలా గత నాలుగేళ్లలో అప్పులు పెరిగిపోయాయి. ఐదోసారి ప్రస్తుత ఖరీఫ్‌లో పంట పెట్టాడు. ఎకరాకి రూ.20 వేల చొప్పున మొత్తం రూ.40 వేలు పెట్టుబడి పెట్టాడు. వేరుశనగ పైరు ఏపుగా పెరిగింది. కాయలు ఏర్పడే కీలక దశలో వర్షాభావం చుట్టుముట్టింది. నెలరోజులు దాటినా చినుకు జాడ లేదు. పంట నిలువునా ఎండిపోతోంది. ఏర్పడిన కాయలు కూడా లొత్తలు అయిపోయాయి. ఇక పంటపై రైతు ఆశలు వదులుకున్నాడు. పశుగ్రాసమైనా దక్కుతుందని పంటను అర్థంతరంగా తొలగించుకుంటున్నాడు. ఇందుకు కూడా కూలీలను పిలుచుకుంటే అది అదనపు భారమవుతుందని భావించాడు. భర్యతో కలిసి పంటను ఇద్దరే తొలగించుకుంటున్నారు. ఎకరాకు రెండు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే అవకాశం ఉందని రైతు వాపోతున్నాడు. క్వింటా రూ.5 వేలతో అమ్ముడుపోయినా.. ఎకరాకి రూ.10వేలకు మించి వచ్చే పరిస్థితి లేదు. ఇంకా.. పంటను తరలించాలి.. వాముగా వేసుకోవాలి, మిషన్‌లో వేరుచేయాలి. కూలీల ఖర్చులు చాలానే భరించాలి. వచ్చే సొమ్ము వీటికే సరిపోతుంది. ఈ లెక్కన పంట సాగుకు ఇప్పటివరకు వెచ్చించిన రూ.40 వేలు నికరంగా రైతు నష్టపోనున్నాడు. ఇలా ఐదేళ్లలో రూ.2 లక్షలు కోల్పోయాడు కౌలురైతు. ఆ మేరకు అప్పు పెరిగిపోయింది. దానిని ఎలా తీర్చాలోనని ఆవేదన చెందుతున్నాడు. మరో వారం రోజుల్లోగా వర్షం కురవకపోతే వేరుశనగ పంటను జిల్లా వ్యాప్తంగా తొలగించుకోవాల్సిందేనని రైతులు వాపోతున్నారు.

రూ.40వేలు నష్టం

- అస్లాంబాషా, కౌలురైతు, మడకశిర

నాలుగేళ్లుగా పంట పెట్టి నష్టపోతూనే ఉన్నా. ఈసారి అదునులో ఒక పదును వర్షం పడినా.. మా తలరాత మారేది. కష్టాల నుంచి గట్టెక్కేవారం. ఎకరాకు 20 బస్తాల దాకా దిగుబడి వచ్చేది. ప్రస్తుతం 6 బస్తాలు కూడా వచ్చే పరిస్థితి లేదు. పెట్టుబడి కూడా దక్కదు. పశుగ్రాసమైనా దక్కుతుందని పంటను తొలగించుకున్నా. ప్రభుత్వం పరిహారం చెల్లించి, ఆదుకోవాలి.

-మడకశిర

పశువధశాలలపై పోలీసుల దాడి

పశుమాంసం, ఎముకలు, కొమ్ముల స్వాధీనం... నలుగురి అరెస్టు



పశు కళేబరాలను పూడ్చిన స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

గోరంట్ల, సెప్టెంబరు 21: మండలంలోని పులేరు రహదారిలో పొలంలో నిర్వహిస్తున్న పశువధకేంద్రంపై సీఐ శేఖర్ ఆధ్వర్యంలో శనివారం పోలీసులు దాడి చేశారు. రెండు గూడ్స్ వాహనాలు, పశుమాంసం, ఎముకలు, కొమ్ములను స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకులు దస్తగిరి, అల్లాబక్ష, సల్మాన్, ఫైజల్‌ను అరెస్టు చేశారు. కొంతకాలంగా పశువధ కేంద్రం ద్వారా ఆవులు, లేగ దూడలను వధించి, మాంసాన్ని ప్రత్యేక గూడ్సు వాహనాల్లో కర్ణాటకకు తరలిస్తున్నారు. విషయం తెలుసుకున్న సీఐ శేఖర్, పశు సంవర్థక శాఖ ఏడీ శ్రీనివాసరావు.. సిబ్బందితో కలిసి వధశాలపై దాడి చేశారు. ముందుగానే పోలీసులను గుర్తించిన నిర్వాహకులు అప్పటికే వధించిన 25 ఆవులు, దూడల మాంసాన్ని రెండు వాహనాల్లో కర్ణాటకకు తరలించే ప్రయత్నం చేశారు. వధించడానికి సిద్ధంగా ఉంచిన పది ఆవులను మరో వాహనంలో ఎక్కించారు. జాగ్రత్త పడిన నిర్వాహకులు క్షణాల్లో మూడు వాహనాలతో ఉడాయించారు. దీంతో అక్కడున్న ఒక ఆటో, బొలెరో వాహనాన్ని సీజ్ చేసి, అందులోని పశు మాంసం, ఎముకలు, అక్కడున్న మూడువందల పశువుల కొమ్ములను పోలీసులు గుర్తించారు. సమీపంలోని వంకలో మాంసం వ్యర్థాలను పెద్దఎత్తున పూడ్చి వేసిన ప్రాంతాన్ని గుర్తించారు. పట్టుబడిన నలుగురితోపాటు దస్తగిరి కుమారులైన బాబ్‌జాన్, రిజ్వాన్, ఫైజా, తౌహీద్‌పై కేసు నమోదు చేసి, తరలించిన మూడు వాహనాలకోసం గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు. పశువులను వధిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అలరించిన భక్తిగీతాలు

పుట్టపర్తి, సెప్టెంబరు 21: శ్రీకాకుళం జిల్లాకు చెందిన భక్తులు శనివారం స్థానిక ప్రశాంతి నిలయంలో ఆలపించిన భక్తిగీతాలు మైమరపింపజేశాయి. మొదట సత్యసాయి అష్టోత్తర నామావళి పేరుతో పూజలు చేశారు. అనంతరం సత్యసాయి స్వర మాధురిపేరిట సంగీత కచేరి నిర్వహించారు.

కుట్టుమిషన్ల పంపిణీ

ఒడిశా భక్తులకు కుట్టుమిషన్లను సత్యసాయి సెంట్రల్‌ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ పంపిణీ చేశారు. వందలాదిమందికి కుట్టుమిషన్లు, పిండిమిషన్లు, టూల్‌కిట్లను అందజేశారు. కార్యక్రమంలో 3500 మంది భక్తులు పాల్గొన్నారు. అనంతరం వారందరూ సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



టూల్‌కిట్లను పంపిణీ చేస్తున్న ఆర్జే రత్నాకర్

అక్రమార్కులను వదిలే ప్రసక్తేలేదు

● ఎక్కడికి పారిపోయినా విడిచిపెట్టను ● మోసగాళ్లకు శిక్ష తప్పదు: ఎమ్మెల్యే కందికుంట



కదిరిలోని ఓ హోటల్‌లో టీ తాగుతున్న ఎమ్మెల్యే

కదిరి, సెపెంబరు 21: కులం, మతం, రాజకీయం ముసుగులో మోసాలకు పాల్పడే వారికి నియోజక వర్గంలో తావులేదని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ హెచ్చరించారు. అక్రమార్కులు ఎవ్వరైనా... ఎక్కడ దాక్కున్నా.. వదలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. స్థానిక వలీసాబ్ రోడ్‌లో ఓ హోటల్‌లో ఎమ్మెల్యే చాయ్ పే చర్చ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. క్రిస్టియన్ ఆస్తులను కొట్టేసిందెవరో నేడు తేటతెల్లం అయ్యిందని, ఇన్నాళ్లూ రాజకీయ ముగుసులో ఉన్న అవినీతి పరుల ముసుగు తొలగిపోయిందని అన్నారు. క్రిస్టియన్ ఆస్తులు కొల్లగొట్టిన వారిలో ఓ మాజీ మంత్రి, ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు, మరి కొంతమంది ఉన్నార న్నారు. భవిష్యత్తులో వీరందరికి శిక్ష తప్పదన్నారు. బెంగళూరు నుంచి మూడు నెలల ముందు వచ్చి ఎన్నికల్లో పాల్గొనే నాయకులు కూడా చర్చి ఆస్తుల కేసులో నిందితులన్నారు. ఈ కేసు నుంచి వారు తప్పించుకోలేరన్నారు. ఓ మాజీ మంత్రి హిందుపురంలో చర్చి ఆస్తుల్లో నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించు కోవడానికి రూ.కోటి స్టాంప్ డ్యూటీ కట్టినట్లు తెలిసిందన్నారు. ఇక ఆ రూ. కోటి పోయినట్టేనన్నారు. కోర్టులో ఆ మాజీ మంత్రిని దోషిగా నిలబెడతా మన్నారు. ఇటువంటి అక్రమార్కులకు అధికారుల సహకరిస్తే వారికీ శిక్ష తప్పదని హెచ్చరించారు.

స్వచ్ఛతా హీ సేవ : స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని కదిరి ఎమ్మెల్యే స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద జెండా ఊపి ప్రారంభిం చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషర్ కిరణ్ కుమార్, సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇది మంచి ప్రభుత్వం : తలుపులలో నిర్వహించిన ఇది మంచి ప్రభు త్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కందికుంట పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు భూమిపూజ

గాండ్లపెంట: మండలంలోని గొడ్డివెలగల పంచాయతీలోని నీరుకుం ట్లపల్లి నుంచి వీరన్నగట్టుపల్లి వరకు మట్టి రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ శనివారం భూమిపూజ చేశారు. ఒకటిన్నర కిలోమీటర్ రోడ్డును రూ.50 లక్షలతో నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో వాల్మీకి విద్యాసంస్థల అధినేత పవన్ కుమార్‌రెడ్డి, ఎంపీడీఓ రామానాయక్, సింగ్‌విండో మాజీ డైరెక్టర్ వెంకటరమణారెడ్డి, మాజీ సర్పంచ్ ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు పలు సేవా కార్యక్రమాలు

ధర్మవరం, సెప్టెంబరు 21: ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ జన్మదినం సందర్భంగా ఆదివారం పట్టణంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తు న్నట్లు టీడీపీ నాయకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు ఎన్టీఆర్ సర్కిల్‌లోని పాండురంగస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు, అనంతరం గాంధీ సర్కిల్లోని టీడీపీ కార్యాలయంలో కేక్ కటింగ్, ప్రభుత్వాస్పత్రిలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ, కదిరిగేటు, గాంధీసర్కిల్, కొత్త బస్టాండ్, లక్ష్మీచెన్నకేశవపురం ప్రాంతాల్లో అన్నదానం కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. కావున టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్, తెలుగు మహిళలు, అనుబంధ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

నిరుద్యోగ భృతికి దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తి: వేదవిద్యను అభ్యసిం చిన నిరుద్యోగ పండితులు భృతి కోసం దరఖాస్తు చేసుకోవాలని శ్రీసత్యసాయి జిల్లా దేవదాయశాఖ అధికారి నరసింహరాజు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకు సంభందించి ఈనెల 26 లోపు సంబంధిత వేదవిద్య ధ్రువపత్రం, ఆధార్‌కార్డు, ఏ ఉద్యోగం లేదన్న స్వీయ ధ్రువీకరణ పత్రాలతో దేవదాయశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. నిరుద్యోగ పండితులకు నెలకు రూ. మూడు వేలు వంతున భృతి మంజూరు చేస్తామన్నారు.

రేపటిలోగా ఈకేవైసీ చేయించుకోండి

ధర్మవరంరూరల్: ఖరీఫ్‌లో పంటలు సాగుచేసిన రైతులు సోమవారంలోగా ఈ-క్రాప్‌బుకింగ్, ఈకేవైసీ తప్పనిసరిగా చేయించు కోవాలని ధర్మవరం ఏడీఏ క్రిష్ణయ్య తెలిపారు. శనివారం మండలంలోని పోతుకుంట, కుణుతూరు గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లో రైతులతో సమావేశమయ్యారు. ఈకేవైసీ చేయించుకుంటేనే పరిహారాలు, పథకాలు వర్తిస్తాయన్నారు.

వరద బాధితులకు బియ్యం సేకరణ

నల్లమాడ, సెప్టెంబరు 21 : మండలంలోని ఎర్రకవంకపల్లి, మీసావాండ్లపల్లి గ్రామాల్లో శనివారం ఆయా గ్రామాల టీడీపీ నాయకులు వరద బాధితుల కోసం బియ్యం సేకరించారు. ఈ బియ్యాన్ని మండల కేంద్రంలోని కన్వీనర్ మైలే శివశంకర్ నివాసానికి తరలించారు. ఇప్పటి వరకు 650 ప్యాకెట్ల బియ్యాన్ని సేకరించినట్లు మైలే శివశంకర్ తెలిపారు

24న జాబ్‌మేళా

కదిరి అర్బన్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళ వారం జాబ్‌మేళాను నిర్వ హిస్తున్నామని, నిరుద్యోగ యువతీ యువకులు దాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. శనివారం జాబ్‌మేళా కరపత్రా లను ఆయన నివాసంలో విడుదల చేశారు. పది, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీఐ పూర్తి చేసి 18నుంచి 35లోపు వయస్సు ఉన్నవారు అర్హులన్నారు.

ఇలా ఉంటే పిల్లలకు రోగాలు రావా..!

వసతి గృహ నిర్వహణ తీరుపై ఎమ్మెల్యే పల్లె సింధూర ఆగ్రహం



పుట్టపర్తిలోని ఎస్సీ వసతి గృహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 21: 'ఏమిటిది.. హాస్టల్‌ను మరీ ఇంత అపరిశుభ్రంగా ఉంచుతారా... ఇలా ఉంటే పిల్లలకు రోగాలు రావా..' అని ఎమ్మెల్యే పల్లె సింధూ రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఉదయం ఆమె పుట్టపర్తిలోని ఎస్సీ హాస్టల్‌ను మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డితో కలిసి పరిశీలించారు. వసతి గృహం కప్పులు పె చ్చులు ఊడుతూ ప్రమాదకరంగా ఉండటం.. వంటగది, మరుగుదొడ్లు, స్నా నాల గదులు అపరిశుభ్రంగా ఉండటం.. గమనించిన ఆమె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వార్డెన్‌పై మండిపడ్డారు. వసతి గృహం ఎదురుగా ప్రధాన రహదారిపై చెత్తా చెదా రం పేరుకుపోయి ఉండటంపై మునిసిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తీరు మార్చుకోవాలని హెచ్చరించారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ

ఓబుళదేవరచెరువు: వరద బాధితుల కోసం ఎంపీ బీకే పార్థసారధి, ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి విరాళాలు సేకరించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో ప్రభుత్వం జూనియర్ కళాశాలను వారు శనివారం ప్రారంభించారు. రూ. 1,14,50,000 నాబార్డు నిధులతో నిర్మించిన అదనపు తరగతి గదులను ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో వరద బాధితులను ఆదుకోవడానికి దాతలు ముందుకురావాలని కోరారు. దీంతో మొదట నాల్గో తరగతి విద్యార్థిని చందన రూ. రెండు వేలు విరాళం ఇచ్చింది. అనంతరం అర గంటలో పలువురు దాతలు మొత్తం రూ. ఐదు లక్షలను విరాళంగా అందజేశారు.

సైకో జగన్... అబద్ధాలు మానుకో: టీడీపీ

తాడిమర్రి: తిరుమల వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడారని ల్యాబ్ రిపోర్టు వచ్చినా... సైకో జగన్ ఇంకా అబద్ధాలు చెబుతుండటం విడ్డూరంగా ఉందని టీడీపీ మండల నాయకులు మండిపడ్డారు. శనివారం స్థానిక బస్టాండ్ కూడలి వద్ద జగన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కలియుగ దైవం వెంకటేశ్వర స్వామితో జగన్ పెట్టుకున్నాడని, ఇక జగన్ తగిన మూల్యం చెల్లించక తప్పదని అన్నారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు హర్ష, టీడీపీ నాయకులు భాస్కర్‌గౌడ్, గణేశ్, పక్కీర్‌రెడ్డి, నాగేంద్ర, రవి, నాగేశ్, కుళ్లాయరెడ్డి, మురళీగౌడ్ పాల్గొన్నారు.

బుక్కపట్నం: తిరుమల వెంకటేశ్వర స్వామి ప్రసాదం కల్తీకి కారుకులైన వారిని కఠినంగా శిక్షించాలని టీడీపీ మండల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక తేరు కూడలిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ చింతా మల్లిరెడ్డి, సామ కోటి ఆది నారాయణ, చెన్నక్రిష్ణ, గంగాధర్, సయ్యద్ పాల్గొన్నారు.

నేడు 'ఇది మంచి ప్రభుత్వం'

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్ : నల్లచెరువులోని వీవర్సు కాలనీలో ఆదివారం నిర్వహించే ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పాల్గొంటారు. అలాగే నల్లమాడ మండలంలోని వేళ్లమద్దిలో నిర్వహించే కార్యక్రమంలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి పాల్గొంటారు. కాగా శనివారం నంబులపూలకుంట మండలం వంకమదిలో, తనకల్లు మండలంలోని బాలసముద్రం, గేమేనాయక్ తండాలో, పుట్టపర్తిలోని రెండో వార్డులో, బుక్కపట్నం మండలం కొత్తకోట గ్రామంలో ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు, అధికారులు నిర్వహించారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయించండి

పుట్టపర్తి రూరల్: జిల్లా కేంద్రంలోని ముస్లిం శ్మశానవాటిక కోసం రెండెకరాల స్థలం కేటాయించాలని ముస్లిం మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి షేక్ మహమ్మద్ రఫీ పుట్టపర్తి తహసీల్దార్ అనుపమను కోరారు. శనివారం సుడా మాజీ ఛైర్మన్ కడియాల సుధాకర్ నాయుడు, పుట్టపర్తి అర్బన్ కన్వీనర్ రామాంజినేయులు, ఎస్సీసెల్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మనోహర్‌లతో కలసి వినతిపత్రం అందచేశారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోండి

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 21: మండలంలోని ఇనగలూరు పంచాయతీలో సర్వేనెంబర్ 267తో పాటు ఇతర ప్రభుత్వ గుట్టలో ప్రభుత్వానికి పన్ను కట్టకుండా మట్టిని అక్రమంగా తరలించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం గాజుకుంటపల్లి సమీపంలోని వరదరాజుల గుట్ట ప్రాంతాలో అనుమతి లేకుండా మట్టిని తరలించిన ప్రాంతాలను ఆ పార్టీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. వైసీపీ పాలనలో రెండు ఎకరాలకు పన్ను కట్టి.. దాదాపు 60 ఎకరాల్లో ఉన్న గుట్ట మొత్తం తవ్వి నేషనల్ హైవే రోడ్డుకు తరలించారన్నారు. కోట్లాది రూపాయల ప్రభుత్వానికి గండి కొట్టిన దీనిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు అంజనేయులు, చలపతి నాయుడు, రత్నాబాయి, గంగులప్ప, సుధాకర్, రవి, రామచంద్ర, రమణ, వెంకట రమణ పాల్గొన్నారు.







Printed and published by **Koganti Venkata Seshagiri Rao**, on behalf of Aamoda Publications Pvt. Ltd., *Printed and published* at "Aamoda Press" at Sy.No.239-2A, Bypass Road, Ananthapuramu -515 001, Cell No.9985411151, Editor: **K.SRINIVAS.**
RNI No: APTEL/2003/10031 **Managing Director : Vemuri Radha Krishna** Founder : K.L.N.Prasad


ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయాధికారి శ్రీధర్

నేరాల వైపు వెళ్లకండి

● సివిల్ కోర్టు సీనియర్ న్యాయాధికారి శ్రీధర్

హిందూపురం, సెప్టెంబరు 21: నేరాల వైపు వెళ్తే మీతోపాటు మీ కుటుంబాలు ఇబ్బంది పడతాయని సివిల్ కోర్టు సీనియర్ న్యాయాధికారి శ్రీధర్ అన్నారు. శనివారం స్థానిక సబ్‌జైలును ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలులో ఎంతమంది ఖైదీలు ఉన్నారు, ఏ నేరంపై వచ్చారు అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీరు ఒక్కరు నేరం చేయడంవల్ల కుటుంబాలు బజారున పడి అవమానాలకు గురవుతుంటారని తెలిపారు. బయటికి వెళ్లాక నేరాలకు స్వస్తి పలికి మంచి జీవితం ప్రారంభించాలన్నారు. నేరం చేసినప్పుడు తప్పకుండా దొరుకుతారని, మీరు చేసిన నేరం వల్ల మీ కుటుంబ సభ్యులు తలెత్తితిరగడానికి జంకే పరిస్థితి వస్తుందన్నారు. ఈ సందర్భంగా వారికి అందుతున్న సౌకర్యాలపై ఆరాతీశారు. ఎవరికైనా న్యాయవాదులను పెట్టుకునే స్థోమతలేకపోతే న్యాయస్థానం న్యాయవాదిని నియమిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ నాయకులు రాజశేఖర్, శ్రీనివాసరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, సంతోష్‌కుమారి, అబ్దుల్లా, జైలు అధికారి అంజనేయులునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం


వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు

అగళి, సెప్టెంబరు 21: మండల కేంద్రమైన అగళి ఎస్సీకాలనీలో వినాయక నిమజ్జనం శనివారం ఘనంగా నిర్వహించారు. వినాయకులను ప్రత్యేకంగా అలంకరించి ట్రాక్టర్‌లో ఊరేగింగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. ఊరేగింపులో డీజే పాటలు, డప్పు వాయిద్యాలు, యువకుల కేరింతలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో వైసీపీ ఇన్‌చార్జ్ ఈరలక్కప్ప, జడ్పీటీసీ సభ్యుడు ఉమేష్, నారాయణప్ప, నరసింహమూర్తి, మారుతి, ఈరన్న, మహేష్, మురళి, మైకోసెట్ హరీష్, శివ, యోగేష్, మూర్తి, బసవలింగప్ప, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియానికి మోక్షం

● రూ.1.80 కోట్లు మంజూరు

హిందూపురం, సెప్టెంబరు 21: ఎంజీఎం క్రీడా మైదానంలో అర్ధంతరంగా ఆగిన ఇండోర్‌స్టేడియం నిర్మాణం పనులకు ప్రభుత్వం రూ.1.80 కోట్లు నిధులు మంజూరుచేసినట్లు టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు తెలిపారు. గత టీడీపీ హయాంలో నిర్మాణం ప్రారంభించారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నిధులు ఇవ్వక ఆపేశారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో దిష్టి బొమ్మలా తయారైంది. కూటమి ప్రభుత్వం రావడంతో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రత్యేక చొరవ తీసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి రూ.1.80 కోట్లు నిధులు మంజూరు చేయించారు. పనుల కోసం టెండర్లు పిలిచారు. త్వరలోనే ఇండోర్‌స్టేడియం పనులు ప్రారంభమవుతాయని శ్రీనివాసరావు తెలిపారు.

ముగిసిన పాఠశాల క్రీడాపోటీలు

మడకశిర రూరల్, సెప్టెంబరు 21: మండలంలోని కల్లుమర్రి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీలు శనివారం ముగిసినట్లు ప్రధానోపాధ్యాయుడు క్రిష్ణమోహన్, క్రీడల సమన్వయకర్త నాగభూషణం తెలిపారు. వాలీబాల్, ఖోఖో, చెస్, షటిల్‌బాడ్మింటన్, కబడ్డీలో గెలుపొందిన జట్లు ఈ నెల 24,25 తేదీల్లో మడకశిర బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించే నియోజకవర్గ క్రీడా పోటీలో పాల్గొనున్నట్లు తెలిపారు.

ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం: డిప్యూటీ సీఈఓ


మాట్లాడుతున్న డిప్యూటీ సీఈఓ లలితాబాయి

గోరంట్ల, సెప్టెంబరు 21: ప్లాస్టిక్ నిషేధానికి ప్రతిఒక్కరూ సహకరించాలని మండల ప్రత్యేకాధికారి, జడ్పీ డిప్యూటీ సీఈఓ లలితబాయి కోరారు. గోరంట్లలో శనివారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొన్ని ఆమె మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వందరోజుల పాలనను వివరిస్తూ స్వచ్ఛతాహి సేవ గురించి వివరించారు. సంపద నిర్మిత కేంద్రాల ద్వారా తడి, పొడి చెత్త వేరుచేసే కార్యక్రమాలను సమర్ధవంతగా నిర్వహించలేదన్నారు. ప్లాస్టిక్ వాడకం వలన క్యాన్సర్ వస్తోందని, భవిష్యత్ తరాల కోసం కాలుష్య రహిత సమాజాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకోసం ప్లాస్టిక్ నిషేధానికి శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ సోముశేఖర్, ఎంపీడీఓ రఘునాథ్‌గుప్త, ఎంఈఓ గోపాల్ తదతరులు పాల్గొన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయాన్ని డిప్యూటీ సీఈఓ తనిఖీ చేశారు.

పెనుకొండ: ప్లాస్టిక్ ఉత్పత్తిని నివారించలేకున్నా వాడకాన్ని క్రమేపి తగ్గిస్తూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం కావాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు అన్నారు. శనివారం స్థానిక కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రాంగణంలో ప్లాస్టిక్ కవర్లు, వాటర్‌బాటిళ్లు తదితర వాటిని సేకరించారు. వైస్ ప్రిన్సిపాల్, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ జయప్ప, చరిత్ర అధ్యాపకుడు ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిద్దామంటూ విద్యార్థులచే ప్రమాణం చేయించారు.

నవయుగ వైతాళికుడు గురజాడ

పెనుకొండ, సెప్టెంబరు 21: మహిళా అభ్యున్నతి కోసం పాటుపడిన గొప్ప సంఘసంస్కర్త గురజాడ అప్పారావు అని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్ తెలిపారు. శనివారం స్థానిక కళాశాలలో నవయుగ వైతాళికుడు గురజాడ అప్పారావు జయంతి వేడుకలను ప్రిన్సిపాల్ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా గురజాడ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థుల మధ్య కేక్‌కట్‌చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం పాటుపడిన వ్యక్తి గురజాడ అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు శంకరప్ప, శ్రీకళ, శివన్న, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ హఫీజ్, శ్రీలేఖ పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీకళాశాలలో గురజాడ అప్పారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ జయప్ప అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గురజాడ అప్పారావు వాడుక భాష వ్యాప్తికి ఉద్యమించారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు యశోదారాణి, హరిప్రసాద్, ప్రసాద్, నారాయణ పాల్గొన్నారు.


డిగ్రీ కళాశాలలో ప్రసంగిస్తున్న వైస్ ప్రిన్సిపాల్ జయప్ప

అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

'ఇది మంచి ప్రభుత్వం'లో మంత్రి సవిత


మాట్లాడుతున్న మంత్రి సవిత

హిందూపురం (సోమందేపల్లి), సెప్టెంబరు 21: రాష్ట్ర అభివృద్ధే తమ ప్రభుత్వం లక్ష్యమని బీసీ సంక్షేమ, చేనేత, జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని పలు పంచాయతీల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన అనంతరం చాలకూరు గ్రామంలో ఏర్పాటు చేసి 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ప్రజలు తమను నమ్మి గెలిపించారని, వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారంవైపు దృష్టిసారించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తమకు హితబోధ చేశారని అన్నారు. ఈ వందరోజుల్లో ఎవరిపైనైనా అక్రమకేసులు పెట్టామా అని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు తాము శ్రమిస్తున్నామన్నారు. నా బీసీలు, నా ఎస్సీలు, నా ఎస్టీలు అని చెప్పి 2019లో గద్దెనెక్కిన జగన్ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారన్నారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన సైకో జగన్ అన్నారు. పరిశ్రమలు, ఉద్యోగాలు ఇవ్వకపోగా ప్రభుత్వ ఆస్తులు కుదువ పెట్టి లక్షల కోట్లు అప్పులు చేశాడన్నారు. చివరకు ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ ద్వారా తరతరాలుగా సంక్రమించిన భూములు, ఆస్తులుకూడా కాజేసి తాకట్టుపెట్టుకోవాలని చూశాడన్నారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, సిద్ధలింగప్ప, సూరి, హరిక్రిష్ణ, భానుకీర్తి, శ్రీరాములు, అంజినప్ప, సుధాకర్‌రెడ్డి, రామాంజినేయులు, అధికారులు పాల్గొన్నారు. మండల కేంద్రంలో నల్గొండ్రాయపల్లి సమీపంలో గతంలో పేదలు వేసుకున్న గుడిసెలను అధికారులు తొలగించారని సీపీఐ నాయకులు బాలస్వామి మంత్రికి వినతిపత్రం అందించారు. పేదలకు ఇళ్లు మంజూరు చేయాలన్నారు. పాపిరెడ్డిపల్లి వద్ద వేలుపు కొండలో చేపడుతున్న క్వారీని వెంటనే ఆపాలని కేజీబీవీ విద్యార్థులు మంత్రి సవితను కలిసి వినతిపత్రం అందించారు.

విద్యార్థులతో కలిసి భోజనం చేసిన మంత్రి : సోమందేపల్లి మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంత్రి సవిత విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మొదట పాఠశాలలో భోజన నాణ్యతను పరిశీలించిన ఆమె విద్యార్థులతో కలిసి పలు విషయాలపై ఆరా తీశారు. అనంతరం వారితో కలిసి పాఠశాల ఆవరణంలో భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు రామాంజనేయులునాయక్, ఆనంద్‌బాబు, ప్రధానోపాధ్యాయుడు నరేంద్రప్రసాద్ పాల్గొన్నారు. గుడిపల్లి ఉన్నత పాఠశాల ఆవరణంలో మంత్రి కలిసి మొక్కలు నాటారు. పాపిరెడ్డిపల్లి వద్ద ఉన్న కేజీబీవీలో కోతుల బెడద అధికంగా ఉందని గ్రిల్ ఏర్పాటు చేయాలని మంత్రిని కలిసి ఉపాధ్యాయులు వినతిపత్రాన్ని అందించారు.


విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తున్న మంత్రి

అధ్యాపకులను నియమించాలని వినతి

రొళ్ల, సెప్టెంబరు 21: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ విద్యా సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ కోర్సులు ప్రారంభించడంతో 30 విద్యార్థులు కోర్సుల్లో చేరారు. కానీ మూడు నెలలు గడిచిన ఉపాధ్యాయులను నియమించకపోవడంతో విద్యాబోధన కుంటుపడుతుందని విద్యార్థులు ఎమ్మెల్యే ఎంఎస్ రాజుకు వినతిపత్రం అందజేశారు. శనివారం హొట్టేబెట్ట సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్న సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులు అక్కడికి వచ్చి వినతి పత్రం ఇచ్చారు. అధ్యాపకులను నియమించేందుకు కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని ఆయన హామీ ఇచ్చారు.

ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 21: స్థానిక ఎంజీఎం మైదానంలో శనివారం అండర్-19 బాలబాలికల ఫుట్‌బాల్ జట్టును ఎంపిక చేసినట్లు పీడీ లోకనాథ్ తెలిపారు. జిల్లా స్థాయి పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ ఎంపికలు జరిగాయన్నారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరుగు రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ గంగప్ప మాట్లాడుతూ క్రీడల వల్ల విద్యార్థులు చురుకుగా ఉంటారన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సామ్రాజ్యం అనంతపురం జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పీడీ, కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి సలీం, ఆర్‌డీటీ కోచ్ అంజలి, రామాంజినేయులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటి ముందు దీపం వెలిగిద్దాం

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 21: హిందువులు ప్రతి ఇంటి ముందు దీపం వెలిగించి కలియుగ వైకుంఠ వాసుడిని నమస్కరిద్దామని విశ్వహిందూ పరిషత్ పిలుపునిచ్చింది. తిరుమల లడ్డూ ప్రసాదంలో ఆవు, పంది కొవ్వు, చేప నూనెలతో, నెయ్యిలో కల్తీ చేసి యావత్ ప్రపంచం ఇష్టపడే పవిత్ర లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంకటేశ్వరుడిని ప్రార్థిస్తూ ప్రతి ఇంటి ముందు దీపం వెలిగించాలన్నారు. పాప ప్రక్షాళన కోసం ప్రతి ఒక్కరూ దీపంతో పాటు 108 సార్లు ఓం నమో వెంకటేశాయ అని భగవత్‌నామ స్మరణ చేయాలని కోరారు.

మహిళలపై దాడులను అరికట్టాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ కార్యకర్తలు

పావగడ, సెప్టెంబరు 21: కార్మికులుగా పనిచేస్తున్న మహిళలపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలను అరికట్టాలని సీఐటీయు ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ చేపట్టారు. కోలకతాలో వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్యను ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం సమస్యగా మారిందన్నారు. దోషులను కఠిన శిక్షలు వేయకపోవడంతోనే ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయని సీఐటీయు కార్యదర్శి సుశీలమ్మ తెలిపారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. కెంచమ్మ, శివగంగమ్మ, గంగాధర్, రామాంజినప్ప, రమేజ, అనేక మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు మంత్రి భూమిపూజ


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సవిత

హిందూపురం (సోమందేపల్లి), సెప్టెంబరు 21: సోమందేపల్లి మండలంలో రూ.1.72కోట్ల అభివృద్ధి పనులకు శనివారం బీసీ సంక్షేమ, చేనేత, జౌళిశాఖ మంత్రి సవిత భూమిపూజ చేశారు. 'మా మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా గుడిపల్లిలో ప్రచారం నిర్వహించిన ఆమె గుడ్డం రంగనాథస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. రూ.20లక్షలతో సీసీ రోడ్లకు భూమిపూజ చేశారు. మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఉన్న బీసీ బాలికల వసతి గృహం మరమ్మతులు, ప్రహరీ నిర్మాణానికి సంబంధించి రూ.32లక్షల పనులకు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. గుడ్డం నాగేపల్లిలో రూ.1.20కోట్లతో నాగేపల్లి నుంచి ఈదులబళాపురం సబ్ స్టేషన్ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు.

సరిహద్దులో పరిశ్రమల ఏర్పాటు

పావగడ, సెప్టెంబరు 21: కర్ణాటక సరిహద్దున ఉన్న మడకశిర నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపనకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి తెలిపారు. శనివారం ఆయన బెంగళూరులో జేడీఎస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు పాల్గొని మాట్లాడుతూ మడకశిర, పావగడ ప్రాంతాల నుంచి దాదాపు 40వేల మంది వలస పోతున్నారని ఈ ప్రాంతంలో పరిశ్రమలు నెలకొల్పితే పావగడ, శిర, మధుగిరి, హిరియూరు, తదితర ప్రాంతాల ప్రజలకు అనుకులంగా ఉంటుందన్నారు. త్వరలోనే కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుని ఇండస్ట్రియల్ పార్కుకు శ్రీకారం చుట్టాలని కేంద్రమంత్రిని ఎంఎస్ రాజు కోరారు.

ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు కౌన్సెలింగ్

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 21: బదిలీల్లో భాగంగా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ల కౌన్సెలింగ్ సజావుగా జరిగింది. శనివారం డివిజన్ కార్యనిర్వాహక ఇంజనీరింగ్ కార్యాలయంలో జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి మురళి ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. 32 మండలాలకు గాను 110 మంది కార్యనిర్వాహక ఇంజనీర్ల బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందులో 80 మందిని శ్రీసత్యసాయి జిల్లాకు నియామకం చేయగా మిగిలిన వారు అనంతపురం జిల్లాకు కోరుకున్నారు. కార్యక్రమంలో డీఈ వెంకటనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

షెడ్ల కోసం దరఖాస్తుల వెల్లువ

గోరంట్ల, సెప్టెంబరు 21: మినీగోకులాలు, గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్ల కోసం రైతులు అధిక సంఖ్యలో దరఖాస్తులు చేసుకున్నట్లు పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. ప్రభుత్వం మండలానికి 45 యూనిట్లు కేటాయించిందన్నారు. అందులో ఓసీ, బీసీలకు 23, ఎస్సీ, ఎస్టీలకు 22 యూనిట్లు వంతున మంజూరు చేసిందన్నారు. ఇప్పటివరకు గోరంట్ల మండలంలో 103 దరఖాస్తులు, సోమందేపల్లిమండల నుంచి 35 దరఖాస్తులు వచ్చాయన్నారు. కోళ్ల షెడ్లకోసం సోమందేపల్లి మండలం నుంచి ఒక దరఖాస్తు మాత్రమే వచ్చిందన్నారు.

కూటమి నాయకుల ఇంటింటి ప్రచారం

మడకశిర రూరల్, సెప్టెంబరు 21: ఎన్డీయే కూటమి ప్రభుత్వం వందరోజుల పాలనపై నాయకులు శనివారం గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. శనివారం కల్లుమర్రి పంచాయతీ కేంద్రంలో సర్పంచు గంగమ్మ, క్లష్టర్ ఇన్‌చార్జ్ నాగరాజు కూటమి నాయకులు సచివాలయ సిబ్బందితో గ్రామాల్లో ప్రజల వద్దకు వెళ్లి ప్రతి ఇంటికి స్టిక్కర్లు అతికించి వంద రోజు అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వీరకేతప్ప, నర్సే గౌడ్, నరసప్ప, రామలింగప్ప, వెంకట్ రెడ్డి, గోవింద్ పాల్గొన్నారు.

అగళి: 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా శనివారం నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వంద రోజుల్లో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కరపత్రాలు అందించి వారి ఆమోదంతో ఇంటి గోడలకు స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు ఉమేష్, సర్పంచ్ రవికుమార్, ఎంపీడీఓ రవికుమార్, పరిపాలన అధికారి శ్రీనివాసరావు, ఈఓఆర్డీ పద్మ, కార్తీక్, పంచాయతీ కార్యదర్శి రంగనాథ్, సర్పంచ్ హనుమంతరాయప్ప తదితరులు పాల్గొన్నారు.

మడకశిరటౌన్: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేస్తున్నారని, ఇప్పటికే పలు హామీలను అమలు చేశారని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ పాలన వంద రోజులు పూర్తయిన సందర్భంగా పలు వార్డుల్లో గడప గడపకు వెళ్లి వివరించారు. కార్యక్రమంలో నాయకులు భక్తర్, నరసింహరాజు, మనోహర్, తిమ్మరాజు, వెంకటలక్ష్మమ్మ, ఉమాశంకర్, సుజాత రమేష్, బలరాం, రవి తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ టౌన్: కూటమి ప్రభుత్వం వందరోజుల పాలన భేష్ అని ప్రజలంటున్నారని టీడీపీ పట్టణ కన్వీనర్ శ్రీరాములు పేర్కొన్నారు. శనివారం వందరోజులపాలన పూర్తయిన సందర్భంగా ఇంటింటికి వెళ్లి పాలనపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ శ్రీనివాసులు, నాయకులు కృష్ణమూర్తి, రమణమ్మ, చంద్రకాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: మండలంలోని గుట్టూరులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం స్పెషల్ ఆఫీసర్ ఎంపీడీఓ శివశంకరప్ప, మాజీ సర్పంచ్ సూర్యనారాయణ, మల్లికార్జున, సచివాలయ సిబ్బంది తదితర టీడీపీ నాయకులు ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు.

హిందూపురం: కూటమి ప్రభుత్వం వందరోజులు పూర్తిచేసుకున్న సందర్భంగా పరిగి మండలంలోని పెద్దరెడ్డిపల్లి గ్రామంలో శనివారం టీడీపీ నాయకులు ప్రవీణ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పాలనపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సోమప్ప, అక్కులప్ప, శివ, హేమంత్, జూలరెడ్డి, లక్ష్మీనారాయణ, తదితర నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

గుడిబండ: ప్రజా సంక్షేమానికి టీడీపీ ప్రభుత్వం ఎంతో కృషిచేస్తుందని నాయకులు మద్దనకుంటప్ప, లక్ష్మీనరసప్ప, భీమరాజు, ప్రకాశ్, దుర్గేష్, తదితరులు ఆయా గ్రామాల్లో పర్యటించి అవగాహన కల్పించారు. మండలపల్లి, కెకెపాళ్యం, మద్దనకుంట, కొంకల్లు, గుడిబండ, తదితర గ్రామాల్లో నాయకులతోపాటు అధికారులు ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ ఇది మంచి ప్రభుత్వంపై అవగాహన కల్పించారు.

మడకశిర: అమరాపురం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో ప్రత్యేక అధికారుల ద్వారా వంద రోజుల్లో సాధించిన ప్రగతి కరపత్రాలను విడుదల చేశారు. మండల నాయకులు గణేష్, జయకుమార్ వంద రోజుల్లో సాధించిన విజయాలపై ప్రజలకు వివరించారు.

చిలమత్తూరు: అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ప్రజా సంక్షేమ పాలన అందించిన ఘనత చంద్రబాబుకే దక్కిందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. శనివారం మండల వ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు కలిసి గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి 'ఇది మంచి ప్రభుత్వం' అనే కార్యక్రమం నిర్వహించారు. నాయకులు అంజినప్ప, శ్రీనివాసరెడ్డి, సత్యనారాయణప్ప, వేణు, నందీశప్ప పాల్గొన్నారు.

లేపాక్షి: కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తిచేసుకున్న సందర్భంగా మండల కేంద్రంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని మండల కన్వీనర్ జయప్ప ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి తెలుగుదేశం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆనంద్‌కుమార్, షెక్షావలి, అంగడి అంజి పాల్గొన్నారు.


మడకశిర: కల్లుమర్రిలో ఇంటింటా ప్రచారం చేస్తున్న కూటమి నాయకులు


కరపత్రం, స్టిక్కర్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి

సంపద సృష్టించి అభివృద్ధి : ఎమ్మెల్యే

రొళ్ల, సెప్టెంబరు 21: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంపద సృష్టించి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా 'ఇది మంచి ప్రభుత్వం' అనే కార్యక్రమాన్ని మండలంలోని హొట్టేబెట్ట గ్రామంలో శనివారం నిర్వహించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజా వేదికలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం పూర్తిగా ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రూ.4వేలు పింఛను ఇచ్చారని, మెగా డీఎస్సీ ప్రకటన విడుదల చేశారని, పేదల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్లు ప్రారంభించారని తెలిపారు. వైసీపీ పాలనలో పంచాయతీలకు ఒక్క రూపాయి ఇవ్వకుండా పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేశారన్నారు. నియోజకవర్గంలో రాళ్లపల్లి రత్నగిరి రిజర్వాయర్, వక్క మార్కెట్ పరిశ్రమ ఏర్పాటు చేసిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. రొళ్ల హొట్టేబెట్ట గ్రామానికి శ్రీనిధి సంఘాల ద్వారా 365 మంది సభ్యులకు రూ.3.23కోట్లు మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆజాద్, అధికారులు, సచివాలయ సిబ్బంది, టీడీపీ, బీజేపీ నాయకులు శ్రీనివాసమూర్తి, దాసిరెడ్డి, పాండురంగప్ప, రవిభూషణ్, ఈరన్న, ముద్దరాజు, నారాయణప్ప, సిద్దగంగప్ప, సురేష్, రామకృష్ణ, నాగరాజు పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే: అమరాపురం మండల పరిధిలోని కస్తూరబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు శనివారం సాయంత్రం తనిఖీ చేశారు. ఎస్‌ఓతోపాటు సిబ్బందితో ఆయన మాట్లాడుతూ విద్యార్థులను సొంత పిల్లలుగా భావించాలని, నాణ్యమైన విద్యను బోధించాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆయనతో పాటు నాయకులు గణేష్, జయకుమార్, నరసింహమూర్తి, ఎస్‌ఓ శోభారాణి పాల్గొన్నారు.

వంద రోజుల్లో అభివృద్ధి సున్నా

● వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్


మాట్లాడుతున్న ఉషశ్రీచరణ్

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 21: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులైనా అభివృద్ధి సున్నా అని వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ఎద్దేవా చేశారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి వంద రోజుల్లో ప్రజలకు చేసిందేమి లేదన్నారు. తిరుపతి వెంకన్న స్వామి సన్నిధిలో లడ్డూలో జంతువుల కొవ్వు ఉందని టీడీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వందరోజుల పాలన ఫెయిల్ అయిందని, దానిని డైవర్ట్ చేసేందుకే నాయకులు తిరుపతి లడ్డు ప్రసాదాన్ని తెరమీదకు తెచ్చారని అన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు బోయ నరసింహులు, సుధాకర్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, పొగాకు రామచంద్ర, శ్రీకాంత్‌రెడ్డి, సునీల్, తయూబ్, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలి : ఎస్ఐ


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ మునీర్ అహమ్మద్

చిలమత్తూరు, సెప్టెంబరు 21: విద్యార్థులు నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలని ఎస్ఐ మునీర్ అహమ్మద్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని పొట్టి శ్రీరాములు ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్ ద్వారా సైబర్ నేరాలు అధికంగా జరుగుతున్నాయని, వాటికి విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. బాలికలపై ఈవ్‌టీజింగ్‌కి పాల్పడటం, ఘర్షణలకు దిగడం చేయరాదని చెప్పారు. విద్యార్థులు డ్రైవింగ్‌లో శిక్షణ తీసుకున్న తరువాతే వాహనాన్ని నడపాలన్నారు.

రిజర్వాయర్‌లో పడి కర్ణాటక వాసి మృతి

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 21: మండలంలోని గొల్లపల్లి రిజర్వాయర్‌లో పడి కర్ణాటక వాసి మృతిచెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. పావగడకు చెందిన సంతోష్‌కుమార్(58) ఆరోగ్యం సరిగాలేక మనస్థాపానికి గురై రిజర్వాయర్‌లో పడి ఆత్మహత్య చేసుకున్నట్లు కియా పోలీసులు తెలిపారు. కర్ణాటకలోని హాసన్ జిల్లాకు చెందిన సంతోష్‌కుమార్ పావగడలో పిల్లలకు ట్యూషన్ చెబుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. గత కొన్నేళ్లుగా ఆయన వెరిటో వ్యాధితో బాధపడుతుండేవాడు. మనస్థాపానికి గురై శనివారం మధ్యాహ్నం పావగడ నుంచి కారులో గొల్లపల్లి రిజర్వాయర్‌కు వచ్చాడు. కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడుతూ తాను చనిపోతున్నానంటూ రిజర్వాయర్‌లో దూకేశాడన్నారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, సెప్టెంబరు 21: పట్టణంలో నివాసముంటున్న అశ్విని అనే వివాహిత నిద్రమాత్రలు మింగి శనివారం ఆత్మహత్యకు యత్నించింది. అనిల్‌కుమార్, అశ్విని దంపతుల మధ్య ఆస్తులకు సంబంధించిన మనస్పర్ధలు కొంతకాలంగా కొనసాగుతున్నట్లు బంధువులు తెలిపారు. ఈ నేపథ్యంలో అశ్విని నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించింది. పోలీసులు సంఘటనా స్థలానికెళ్లి తలుపులు బద్దలుకొట్టి ఆమెను బయటకుతీశారు. ఆమెను గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి అనంతరం మెరుగైన వైద్యంకోసం హిందూపురం ఆసుపత్రికి తీసుకెళ్లారు.

కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ


పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

మడకశిర టౌన్, సెప్టెంబరు 21: మండల పరిధిలోని కల్లుమర్రి ఉన్నత పాఠశాల ఆవరణంలో జరిగిన క్రీడా పోటీల్లో విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో నియోజకవర్గ స్థాయికి అత్యధిక మంది ఎంపికయ్యారు. అండర్-14, అండర్-17 క్రీడా పోటీల్లో ప్రతిభ కనపర్చారు. ఖోఖో జూనియర్, సీనియర్ పోటీల్లో విజేతలుగా నిలిచారు. యోగా విభాగంలో బిందు, రజనీ, మాలశ్రీ మొదటి స్థానంలో నిలిచారు. కబడ్డీ సీనియర్ విభాగంలో రన్నర్‌గా నిలిచారు. అథ్లెటిక్స్ పోటీల్లో వంద మీటర్ల పరుగుపందెంలో మధుప్రియ మొదటి స్థానంలో నిలవగా, రెండు వందల మీటర్ల పరుగు పందెంలో దీక్ష మొదటి స్థానంలో నిలిచారు. 400 మీటర్ల పరుగు పందెంలో మధుప్రియ మొదటి స్థానంలో నిలిచింది. 600 మీటర్ల పరుగుపందెంలో దీక్ష మొదటి స్థానంలో నిలిచింది. సీనియర్స్ విభాగంలో 200 మీటర్ల పరుగుపందెంలో నవ్యశ్రీ, 400 మీటర్ల పరుగుపందెంలో శశికళ, 800 మీటర్ల పరుగుపందెంలో నయన, 1500 మీటర్ల పరుగుపందెంలో భారతీ మొదటి స్థానంలో నిలిచారు. లాంగ్‌జంప్‌లో దీక్ష, దివ్య మొదటి, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. షాట్‌పుట్‌లో శాలిని మొదటి స్థానంలో నిల్వగా హైజంప్‌లో నవ్యశ్రీ మొదటి స్థానంలో నిలిచారు. ఉపాధ్యాయులు, పీఈటీ అనిత విద్యార్థులను అభినందించారు.